క్లుప్తంగా

ప్రసన్నాంజనేయుడికి అరటిపండ్ల పూజ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి అమావాస్య సందర్భంగా ఆదివారం అరటిపండ్లతో పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందేతీర్థం, అనంతరం స్వామివారికి అభిషేకం, అలంకరణ తదుపరి ఉభయ దాతలు, అర్చకులు మంగళ వాయిద్యాలతో ఆలయప్రదక్షిణ చేశారు. గణపతిపూజ, రుతి్వకరుణ అనంతరం 11 ఆవృత్తాలుగా అరటి పండ్ల పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మహానివేదన, పంచాహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న బక్తులు ఉభయదాతలకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శ్రావణ మాసం, అశ్లేష నక్షత్రం, తిథి విదియ సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వైభవంగా పోలేరమ్మతల్లి కొలుపులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం ఉదయం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రికి గ్రామంలోని రామాలయం బజారుకు చెందిన రైతన్నల బిడ్డలు, యువతీ, యువకులు పెద్ద ఎత్తున అమ్మవారి జాతరలో చిందులేశారు. అమ్మవారికి వీరతాళ్లతో నృత్యాలు చేశారు. బాణా సంచాలు కాలుస్తూ, కనకతప్పెట్లతో గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాన్ని ఊరేగించారు. కొలుపులు నిర్వహించడం వలన ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని, మంచి దిగుబడులతో పాటు, గిట్టుబాటు ధరలను అమ్మవారు కల్పిస్తారని అన్నదాతలు, గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోలీసుల అదుపులో దొంగలు

అద్దంకి రూరల్: పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగలను దొంగిలిస్తున్న ఐదుగురు నిందితులను ఆదివారం ఎస్సై నాగరాజు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. వారు అద్దంకి పట్టణానికి చెందిన వారిగా గుర్తించారు.

హనిమిరెడ్డి నివాళులు



మృతదేహానికి నివాళులర్పిస్తున్న చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రావినూతల రామకృష్ణ సతీమణి శకుంతల (57) శనివారం మృతి చెందారు. అద్దంకి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆమె భౌతిక కాయానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విశ్రాంత ఎంపీడీవో మృతి



జీ మార్తమ్మ (ఫైల్)

మేదరమెట్ల: మేదరమెట్ల గ్రామానికి చెందిన గుమ్మడి మార్తమ్మ (71) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈమె మద్దిపాడు, తాళ్లూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లో ఎంపీడీవోగా ఎక్కువ కాలం పనిచేశారు. ఈమె మృతికి ఉద్యోగ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చినగంజాం (ఇంకొల్లు): ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఇంకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం ఏడు గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపునకు తరలివచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మహిళలకు పురుషులకు వేరువేరుగా ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపునకు హాజరైన వారికి పురుషులకు మహిళలకు వేర్వేరుగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంపుకు హాజరైన వారికి ప్రత్యేక వైద్య బృందం రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 1048 మంది హాజరు కాగా 475 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు రిఫర్ చేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

రూపుమారిన మరుభూమి



శ్మశానంలో ఏర్పాటు చేసిన టాయిలెట్లు, రన్నింగ్ వాటర్ ట్యాంకు



ధ్యానంలో ఉన్న శివుడి విగ్రహం

- కొణిదెనలో గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి
- తుదిదశకు చేరిన పనులు
- రూ. 5 లక్షలతో శ్మశానానికి 25 సెంట్ల స్థలాన్ని కేటాయించిన సర్పంచ్

బల్లికురవ: చివరకు మనిషి కోరుకునేది ఆరడుగుల స్థలం. మనిషి చనిపోతే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఇబ్బందులు పడకూడదని భావించిన ఆసర్పంచ్ గ్రామ పంచాయతీ నిధులు రూ. 20 లక్షలతో మరుభూమిని పూర్తిస్థాయిలో అభివృద్ధితో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొణిదెన గ్రామానికి ఉత్తరభాగంలో సర్వే నంబర్ 457లో హిందుశ్మశాన వాటికకు 51 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. గుట్టలు, పుట్టలతో మనిషి చనిపోతే బతికున్నవారు నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ కాపులూరి లేపాక్షి విష్ణు గ్రామ పంచాయతీ నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధికి సభ్యుల ఆమోదంతో తీర్మానించారు.

20 లక్షలతో అభివృద్ధి పనులు..

పంచాయతీ సభ్యుల ఆమోదంతో గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో గుట్టలు పుట్టలను పొక్లెయిన్‌తో తొలగించారు. పూర్తిస్థాయిలో అభివృద్ధికి స్థలం చాలదని భావించారు. శ్మశానం పక్కనే ఉన్న 456 సర్వే నంబర్‌లో అచ్యుత జగ్గారావుకు చెందిన 25 సెంట్ల భూమిని సర్పంచ్ తన సొంత డబ్బు రూ. 5 లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు. ఈ భూమిని శ్మశానానికి కేటాయించారు. ఈమొత్తం స్థలం 76 సెంట్లలో వైకుంఠపురి పూర్తి వసతులతో నిర్మించారు. చుట్టూ ప్రహరీ, శవపేటిక, అస్థికలు భద్రపరుచుకునే గదులు, అంతిమ సంస్కారాలు, చేసుకునేందుకు వరండాలు, ధ్యానంలో ఉన్న శివుడి విగ్రహం కార్యక్రమాలకు వచ్చిన బంధుమిత్రులు కూర్చుకునేందుకు బల్లలు, టాయిలెట్స్, విశ్రాంతి గదులు నీటివసతి సమకూర్చారు. ఇందులోనే పచ్చని చెట్లు పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మరుభూమిని పూర్తిస్థాయిలో అభివృద్ధి పర్చటం పట్ల గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కష్టాలు తొలగాయి..



గుట్టలు, పుట్టలు చెట్లు పెరిగి కుచించుకుపోయిన శ్మశాన వాటికను సర్పంచ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడంతో చెట్లు పెంచటం వల్ల ఆహ్లాదకరంగా ఉంది. అక్కడే విశ్రాంతి బల్లలు వసతులు ఉండటం వల్ల ఇబ్బందులన్నీ తొలగాయి.

– చల్లగుండ్ల మస్తాన్‌రావు

శివుడి విగ్రహం ఏర్పాటు బాగుంది..



హిందు శ్మశాన వాటిక పూర్తిస్థాయిలో అభివృద్ధితో ధ్యానంలో ఉన్న శివుడి విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో బాగుంది. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచని శ్మశాన వాటికను సర్పంచ్ పూర్తిస్థాయిలో దగ్గరుండి అభివృద్ధి పరచడంతో 25 సెంట్ల స్థలాన్ని ఉదారంగా కేటాయించారు.

– తన్నీరు రామాంజనేయులు



కొణిదెనలో వైకుంఠపురి ఆర్చీ



అభివృద్ధి చేసిన శ్మశాన వాటిక గదులు

పట్టుబడితే తుక్కు తుక్కేనా!



ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ద్విచక్రవాహనాలు



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన కార్లు

- పోలీస్‌స్టేషన్లలో గుట్టలుగా పట్టుబడిన వాహనాలు
- ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ...
- చీరాల పోలీస్‌స్టేషన్లలో వాహనాల పరిస్థితి ఇదీ

చీరాల: పోలీస్ స్టేషన్లలో ప్రమాదాలకు గురైన వాహనాలు, పట్టుబడిన వాహనాల పరిస్థితి దారుణంగా ఉంది. సంవత్సరాల కొద్దీ ఉంచిన వాహనాలు తుక్కుగా మారుతున్నాయి. దీంతో పోలీస్ స్టేషన్లలో వీటికే స్థలం ఎక్కువ స్థలం సరిపోతుంది. వివరాల్లోకి వెళితే.. ప్రమాదాలు కావచ్చు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపటం కావచ్చు, సరైన పత్రాలు లేని వాహనాలు ఇలా కారణం ఏదైనా పోలీసులకు పట్టుబడిన వాహనాలు స్టేషన్లలో తుప్పుపట్టిపోతున్నాయి. చీరాల ఒన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో గుట్టలుగా ఇలాంటి వాహనాలు పేరుకుపోతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎక్కువ సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్లు ఉన్నాయి. పలు రకాల కేసుల్లో వీటిని పోలీస్‌స్టేషన్ లోపల ఉంచారు. అలానే పోలీసు స్టేషన్ ఎదుట డివైడర్ వద్ద వ్యాన్లు, ఆటోలు ఉంచారు. అలానే కొత్తపేటలోని చీరాల టూటౌన్, రూరల్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. టూటౌన్, రూరల్ సర్కిల్ పరిధిలో ప్రమాదాలకు, దొంగతనాలకు గురైన కార్లు, ఆటోలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ద్విచక్రవాహనాలు గుట్టలుగా ఉన్నాయి. ఇవన్నీ కొన్ని సంవత్సరాలుగా పోలీసు స్టేషన్లలో ఉండిపోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పాడవుతున్నాయి. వీటిని ఉంచేందుకు స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కన ఉంచారు. రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వ్యాన్లతో పాటు 216 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలలో దెబ్బతిన్న కార్లు, ఆటోలు ఎక్కువగా ఉన్నాయి. చీరాల పరిసర ప్రాంతాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించినప్పుడు అనుమానిత ద్విచక్రవాహనాలు, సరైన పత్రాలు లేనివి ఉన్నాయి. అలానే 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ ప్రమాదాలలో దెబ్బతిన్న వాటిని కూడా ఇక్కడే నిలుపుతున్నారు. ఈవాహనాలకు సంబంధించిన భాగాలు ఇప్పటికే పూర్తిగా పాడైపోయాయి. వీటి ఇలా వదిలేయడం వలన ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా ఈ తుప్పు పట్టిన వాహనాలకు మోక్షం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

బధిరుల ఆశ్రమానికి కూలింగ్ ఫ్రిజ్‌ అందజేత



పాఠశాలకు అందజేసిన ఫ్రిజ్‌తో కమిటీ సభ్యులు

అద్దంకి: సేవా స్ఫూర్తి కమిటీ ఎస్ఎస్‌సీ 1989–90 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. దానిలో భాగంగా శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల పాఠశాలలో బధిరుల ఆశ్రమంలో చిన్నారుల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆశ్రమ పాఠశాలకు రూ.26 వేల వ్యయంతో కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్ అందజేసి 65 మంది పిల్లలకు భోజనం పెట్టారు. ఈసందర్భంగా కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతూ 2015లో ఏర్పడిన సేవాస్ఫూర్తి కమిటీ గత తొమ్మిదేళ్ల నుంచి ప్రతి సంవత్సరం వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, బధిరుల పాఠశాలల్లో స్నేహితుల దినోత్సవం కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన ఉప కార్యదర్శి ధర్మవరపు వెంకటరావు, ట్రెజరర్ కొత్త శ్రీమన్నారాయణ, సభ్యులు బాలాజీ, పురుషోత్తం, నరహరి, శ్రీను, పల్లపోతు శ్రీను పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల: ఇటీవల కాలంలో కుక్కల దాడులు ఎక్కువయ్యాయి. అందులో భాగంగానే కొరిశపాడు మండలం మేదరమెట్ల బైపాస్ ప్రాంతంలో ఆదివారం ముగ్గురు బాలురుపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికుల సమాచారం మేరకు బైపాస్ వద్ద గల దాబా సమీపంలో పిల్లలు ఆడుకుంటుండగా కుక్కలు ముగ్గురిపై దాడి చేశాయి. గాయపడిన వారిలో దినేష్, జిలానీలను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అమన్ అనే బాలుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. గ్రామంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉండటంతో పాటు పలు వీధుల్లో వాటి దాడులు అధికమయ్యాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను దూరంగా వదలే కార్యక్రమాన్ని చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ



ఉపకార వేతనాలు అందిస్తున్న వైశ్యనిధి సభ్యులు

వేటపాలెం: ఆర్థికంగా వెనకబడిన పేద ఆర్యవైశ్య విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగించుకొని చదువుల్లో రాణించాలని వైశ్య విద్యానిధి అధ్యక్షుడు పొన్నూరు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో పేద వైశ్య విద్యార్థులకు వైశ్య విద్యానిధి నుంచి ఉపకార వేతనాలు పంపిణీ ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 58 ఏళ్లుగా ఆర్థికంగా వెనక పడిన పేద వైశ్య విద్యార్థులకు ఆరో తరగతి నుంచి బీటెక్ వరకు చదువుల్లో ప్రోత్సహించడానికి ఉపకార వేతనాల రూపంలో నగదు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోడూరి రామకృష్ణ, వైశ్య విద్యానిధి గౌరవ అధ్యక్షుడు వీ మురళీకృష్ణమూర్తి, ప్రత్తి ముత్తుకుమరన్, ఉపాధ్యక్షుడు ఆకుల ప్రసాద్, కోశాధికారి విప్రనారాయణ, సహాయ కార్యదర్శి ప్రతి పార్థసారథి, ప్రతి వెంకట నాగలక్ష్మి, సీ జ్యోతిర్మయిదేవి, పోలిశెట్టి నాగలక్ష్మి, వంశీ ప్రియ పాల్గొన్నారు.

శ్రావణ మాసానికి ఆలయాల ముస్తాబు



వేడుకలకు సిద్ధం చేస్తున్న ఆలయం

బల్లికురవ: శ్రావణమాస పూజలు వ్రతాలు ఆచరించేందుకు మండలంలోని ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. సోమవారం నుంచి శ్రావణ మాసం ఆరంభమై సెప్టెంబర్ 1తో ముగియనుంది. మాసంలోనే శ్రావణ మంగళగౌరి వ్రతాలు, వరలక్ష్మీవ్రతాలు, రాఖీపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, సంకష్టహర చతుర్ది, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉండటంతో కొండయాపాలెం, చెన్నుపల్లి, కొణిదెన, చిన అంబడిపూడి, కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, గ్రామాల్లోని ఆలయాలను ధర్మకర్తలు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.

శాకంబరీ దేవిగా గంగమ్మతల్లి



శాకంబరీ దేవి అలంకరణలో గంగమ్మతల్లి



బల్లికురవ: అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

కారంచేడు: స్థానిక కారంచేడులోని గ్రామ దేవత గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున అమ్మవారికి విశేష పూజలు, లలితా పారాయణం నిర్వహించారు. ఆషాఢ బహుళ అమావాస్య ఆదివారం రోజున మహా శక్తివంతమైన రోజుగా భక్తుల విశ్వాసం. అమ్మవారిని శాకంబరీ దేవిగా అన్ని రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, చీరాల, పర్చూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున బక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.



బల్లికురవ: భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్లికురవలోని గ్రామదేవత పోలేరమ్మ 13వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించారు. అర్చకులు ఇంకొల్లు సుధీర్‌శర్మ, మధుబాబులచే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, విశిష్ట పూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాత్రికి ప్రత్యేక పూజలు భజనలతో వేడుకలు ముగిశాయి.

హోరాహోరీగా పోలురాధా ఎడ్ల పోటీలు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: పట్టణంలోని హరిప్రసాద్‌నగర్‌లో పోలు రాధా ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ఆదివారం ప్రారంభించారు. 200 కేజీల బరువు లాగుడు పోటీలలో వివిధ జిల్లాల నుంచి 15 ఎడ్ల జతలు తలపడ్డాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు పశుసంపద కూడా ముడిపడి ఉందన్నారు. ఇందులో ప్రధానంగా ఒంగోలు జాతి ఎద్దులు శక్తి సామర్థ్యాలు నేడు దేశం గర్వించదగ్గ స్థాయిలో ఉన్నాయన్నారు. అయితే సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోకుండా ఇటువంటి పోటీలు పట్టణాలలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఒంగోలు జాతి, మైసూల్ ఎద్దులతో ప్రపంచం మొత్తం దేశం వైపు చూస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సుబ్బయ్య, రాజు, రాజేష్, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా స్నేహితుల దినోత్సవం



మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావుకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల /చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్, ఎస్ఆర్అండ్‌పిఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైస్కూలు క్రీడామైదానంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో పాటు మైదానంలోని క్రీడాకారులందరికి మణికట్టు బ్యాండ్లు కట్టి ఆనందోత్సాహాల మధ్య మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పాల్గొని వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్నేహితులంటే సంతోషంలోనే కాక ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకోవాలని, కుల మతాలకు అతీతంగా కలసిమెలసి ఉండాలని అన్ని వేళల్లో నేనున్నాననే భరోసాను స్నేహితులకు ఇవ్వాలని సూచించారు. ఈ సృష్టిలో అన్ని బంధాల కన్నా స్నేహ బంధమే గొప్పదని పేర్కొన్నారు. కార్యక్రమానంతరం వాకర్స్ సభ్యులు చైర్మన్ జంజనంతో క్రీడా మైదానంలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, సెక్రటరి చారుగుళ్ల గురుప్రసాద్, గొడవర్తి సుధాకర్, వలివేటి మురళీ కృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, చింతా రమేష్, బదరీనాథ్, దేగల తిరుపతిరావు, పూర్ణచంద్రరావు, నారాయణమూర్తి, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న మోటారు బైకు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

మేదరమెట్ల: కంటైనర్ లారీని వెనుక నుంచి మోటారు బైకు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల పైలాన్ బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. చెన్నై వైపు నుంచి విజయవాడ వైపుకు వెళ్తున్న కంటైనర్ లారీ పైలాన్ బ్రిడ్జి పైకి రాగానే వెనుక నుంచి వచ్చిన మోటారు బైకు ఢీ కొంది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న ఇరువురికీ తీవ్రగాయాలు కాగా క్షతగాత్రులు ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తులు జే.పంగులూరు మండలం తక్కెళ్లపాడుకు చెందిన వారుగా సమాచారం.

అద్దంకి పట్టణంలో..

అద్దంకి రూరల్: ముందు వెళుతున్న బైకు వెనకవస్తున్న లారీ ఢీ కొట్టిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణం దామావారిపాలేనికి చెందిన దామా శేషగిరి అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై అద్దంకి పట్టణంలోని కలవకూరు వెళ్లే జంక్షన్ వద్ద బైకు మీద వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనక వస్తున్న లారీ ఢీకొట్టడంతో శేషగిరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.